రంగు మారిన నీళ్లు.. తాగితే రోగాలే!

గౌలిపురా డివిజన్‌లోని పలు బస్తీలో సరఫరా అవుతున్న కలుషిత నీరు



కలుషిత నీటిని చూపుతున్న ప్రజలు

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని వైనం



గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని పలు బస్తీలో కొన్ని రోజులుగా కలుషిత తాగునీరు సరఫరా అవుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లోని దానయ్యనగర్, సర్దార్ పటేల్‌నగర్, బాలాగంజ్, అచ్చయ్యనగర్, అంబికానగర్, ఎస్సార్టీ కాలనీ, కందికల్ గేట్, న్యూ ఛత్రినాక తదితర ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కలుషిత తాగునీటి సరఫరా జరుగుతుంది. రోజు విడిచి రోజు సరఫరా అయ్యే మంచినీరు కొన్ని రోజులుగా కలుషితంగా సరఫరా జరుగుతుండటంతో తాగడానికి నీరందక తాము పడరాని పాట్లు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కలుషిత నీరు సరఫరా కావడంతో నీటిని బయటికి నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కలుషిత నీరు తాగి తాము ఎలాంటి రోగాల బారిన పడాల్సిన వస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. దీనిపై జలమండలి ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కలుషిత నీటి సరఫరాను అరికట్టి ప్రజలను రోగాల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి..



గత వారం, పది రోజులుగా ఎస్సార్టీ కాలనీలో కలుషిత తాగునీటి సరఫరా జరుగుతుంది. తాగానికి నీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. నీరు ఇంటి అవసరాలకు కూడా వినియోగించలేని విధంగా సరఫరా అవుతుంది. కలుషిత తాగునీటి సరఫరాను అరికట్టాలని జలమండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. – సత్యనారాయణ, ఎస్సార్టీ కాలనీ

కలుషిత తాగునీటి సరఫరాను నివారిస్తాం..



గౌలిపురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సరఫరా అవుతున్న కలుషిత నీటి సరఫరాపై సంబంధిత జలమండలి అధికారిని వివరణ కోరగా దానయ్యనగర్, ఎస్సార్టీ కాలనీల్లో కలుషిత నీటి సరఫరాను గుర్తించాం. కందికల్‌గేట్ బ్రిడ్జి నిర్మాణం సమయంలో కచ్చా మోరీ లైన్‌ను తీశారు. దీంతో పలు ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం దానయ్యనగర్, ఎస్సార్టీ కాలనీల్లో పనులను నిర్వహిస్తున్నాం. నాలుగైదు రోజుల్లో కలుషిత తాగునీటి సరఫరాను నివారిస్తాం.– సయ్యద్ ముఖరం బాబా, జలమండలి అలియాబాద్ సెక్షన్ మేనేజర్

'ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుంటున్నా'



నానల్‌నగర్ డివిజన్‌లో స్థానికులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో క్రమంతప్పకుండా ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకుని, వారి సమస్యలను తెలుసుకుంటున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని మేరాజ్‌కాలనీ, నిజాం కాలనీలలో పర్యటించారు. ప్రణాళికబద్ధంగా తాను అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయించి పనులు చేయిస్తున్నానన్నారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎంపీ లాడ్స్ నిధులతో సైతం కార్వాన్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయించారన్నారు. వర్షాకాలం వస్తున్నందున రెండు నెలలుగా కార్వాన్ అన్ని డివిజన్‌లలో డ్రైనేజీలకు పూడికలు తీయించి ధ్వంసమైన డ్రైనేజీ పైపులను తొలగించి కొత్తవి వేశామన్నారు. టోలిచౌకి కార్పొరేటర్ ప్రతినిధి హారూన్ ఫరాన్, సయ్యద్ రఫత్ హుస్సేన్, అలీమొద్దీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌అలీ తదితరులున్నారు.

రైలు ప్రమాద బాధిత కుటుంబాలకు ఎల్ఐసీ సహకారం

క్లెయిమ్స్ పరిష్కారానికి మినహాయింపులు

సాక్షి, సిటీబ్యూరో: ఒడిశా బాలాసోర్‌లో ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ఎల్ఐసీ క్లెయిమ్‌ల పరిష్కారాలు వేగంగా జరిగేందుకు అన్ని విధాలా సహకరించనున్నట్లు ఎల్ఐసీ చైర్‌పర్సన్ సిద్ధార్థ మొహంతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కష్ట కాలంలో బాధిత కుటుంబాల ఆర్థికావసరాలు తీర్చేందుకు అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. ఎల్ఐసీ పాలసీలు, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమాయోజన క్లెయింట్ల కష్టాలను తగ్గించేందుకు పలు మినహాయింపులు ప్రకటించారు. మరణానికి రుజువుగా డెత్‌సర్టిఫికెట్ల బదులుగా రైల్వే అధికారులు, పోలీసులు లేదా ఏదైనా రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వాలకు చెందిన అధికారులు ప్రచురించిన మృతుల జాబితాల్లో పేరుంటే అంగీకరించనున్నట్లు పేర్కొన్నారు. క్లెయిమ్స్‌కు సంబంధించిన సందేహాల పరిష్కారానికి, హక్కుదారులకు తగిన సహకారం అందించేందుకు డివిజనల్, బ్రాంచి స్థాయిలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతరత్రా సహాయం కోసం హక్కుదారులు సమీప బ్రాంచ్/ డివిజన్/కస్టమర్‌జోన్‌లలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. కాల్‌సెంటర్ నెంబర్‌కు ఫోన్ కూడా చేయవచ్చునని తెలిపారు.

బత్తిని కుటుంబానికి పద్మశ్రీ అవార్డు ఇవ్వాలి



బత్తిని గౌరీ శంకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న వి.హనుమంత్‌రావు

చార్మినార్: మృగశిర కార్తె సందర్భంగా ప్రతి సంవత్సరం దీర్ఘకాలంగా ఆస్తమా రోగులకు ఉచితంగా చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న బత్తిని కుటుంబానికి పద్మశ్రీ అవార్డును ఇవ్వాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంత్ రావు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 9న చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా మంగళవారం హనుమంత్‌రావు పాతబస్తీ దూద్‌బౌలిలోని బత్తిని సోదరులు ఉంటున్న నివాసానికి టీపీసీసీ ఫిషర్మెన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌గౌడ్ తదితరులతో కలిసి వెళ్లి చేప ప్రసాదం తయారు చేసే విధానాన్ని, పంపిణీ వివరాలను బత్తిని కుటుంబ సభ్యులైన గౌరీ శంకర్‌గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బత్తిని గౌరీ శంకర్‌ను హనుమంత్ రావు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఆస్తమా రోగులకు ఉచితంగా చేప ప్రసాదం పంపిణీ చేస్తూ నిస్వార్థంగా ప్రజలకు సేవలను అందిస్తున్న బత్తిని కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి వారికి అరుదైన పద్మశ్రీ పురస్కారాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

ఖైరతాబాద్ ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు గడువు 10 వరకు

విజయనగర్‌కాలనీ: ఖైరతాబాద్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో చేరాలనుకున్న విద్యార్థులు తమ దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోపు సమర్పించాలని ప్రిన్సిపాల్ జంజిరాల వెంకన్న పేర్కొన్నారు. ఐటీఐలోని ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్టస్‌మెన్ సివిల్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, రిజర్వేషన్ల ప్రకారం.. ప్రవేశాల ప్రక్రియ ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలను మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఉన్న ఖైరతాబాద్ ఐటీఐ, 89192 34137లో లేదా వెబ్‌సైట్ http://iti.telangana.gov.in లో పొందవచ్చు.

ఉచితంగా పంటి నొప్పి మందు

గోల్కొండ: పంటి నొప్పి, పళ్ల వాపు, పిప్పి పండ్లు మొదలగు పంటి వ్యాధులకు ఉచితంగా మందు పంపిణీ చేస్తున్నామని మహబూబియా హెర్బల్ ప్రొడక్ట్ ప్రతినిధి మహ్మద్ అన్నారు. వనమూలికలతో తయారు చేయబడిన ఈ ఔషధాన్ని అన్ని రకాల పళ్ల సమస్యల కోసం పని చేస్తుందని ఆయన తెలిపారు. మహబూబియా హెర్బల్ ప్రొడక్ట్ వారి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ పంటి నొప్పి మందును ఈనెల 20వ తేదీ వరకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. మందు కావాల్సిన వారు గోల్కొండ రిసాలబజార్‌లోని అక్బరీ మసీదు సమీపంలో గల మహబూబియా హెర్బల్ ప్రొడక్ట్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పొందవచ్చని ఆయన అన్నారు. వివరాలకు 77940 01186లో సంప్రదించవచ్చు.

సన్మానం



చార్మినార్: హైదరాబాద్, సికింద్రాబాద్ నార్నూల్ అగర్వాల్ సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్నికైన పంకజ్‌కుమార్ అగర్వాల్‌ను చార్‌కమాన్ ప్రభాత్ ఫేరీ ప్రతినిధులు మంగళవారం పాతబస్తీ రికాబ్‌గంజ్‌లో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పంకజ్‌కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ.. నార్నూల్ అగర్వాల్ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బ్రిజ్‌మోహన్ అగర్వాల్, సురేందర్, లక్ష్మీనారాయణ, సత్య చంద్ పాల్గొన్నారు.

మీరాలంమండి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఈఈ హరి కిషోర్

చార్మినార్: బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ ఈఈ హరి కిషోర్ మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయాన్ని మంగళవారం సందర్శించి అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు ప్యారసాని వెంకటేష్ ఉన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ రూపేశ్

సంతోష్‌నగర్: రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉంటూ సమాజంలో మంచి పౌరులుగా నడుచుకోవాలని సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్. రూపేశ్ అన్నారు. సౌత్, ఈస్ట్ పరిధిలోని సంతోష్‌నగర్, ఐ.ఎస్.సదన్, కంచన్‌బాగ్, చాంద్రాయణగుట్ట, బండ్లగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు మంగళవారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్లు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూదన్నారు. సౌత్, ఈస్ట్ డివిజన్ అదనపు డీసీపీ మనోహర్, సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌కుమార్, కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కిశోర్, ఐ.ఎస్.సదన్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

బహదూర్‌పురా: ఈనెల 10న కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నారని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్ డి.నాను నాయక్ తెలిపారు. కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌లో యాక్సిడెంట్, దాడులు, చీటింగ్, భూ తగాదాలు, వివాహ బంధాలు, చిన్న చిన్న దొంగతనాలు తదితర కేసులను ఎదుర్కొంటున్న ప్రజలు కేసులను రాజీ కుదుర్చుకొని కేసులను క్లోజ్ చేసుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్‌కు ఆదరణ



యోగేష్‌యాదవ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్‌కు ఆదరణ లభిస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ, అభివృద్ధితోనే అన్నివర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్నారని ఆయన అన్నారు. గోషామహల్ నియోజకవర్గ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడిగా యోగేష్‌యాదవ్‌ను గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడిగా యోగేష్‌యాదవ్‌ను నియమించి నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా పార్టీ పటిష్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ఎస్.ధన్‌రాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌సింగ్ జమేదార్ పాల్గొన్నారు.

ఉచిత విద్యనందించేందుకు ప్రత్యేక కృషి



అబిడ్స్ కట్టెలమండిలో ఉచిత అడ్మిషన్లు జారీ చేస్తున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో విద్యార్థులకు గడ్డం గంగాధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత విద్యనందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం కట్టెలమండిలో ఉచిత అడ్మిషన్ల జారీ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నలుమూలలా ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఉచితంగా విద్యను బోధిస్తామన్నారు. అర్హులైన విద్యార్థులందరూ తనను సంప్రదిస్తే వారికి అడ్మిషన్లు జారీ చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మురికివాడలు, బస్తీల్లో విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమన్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో హరితహారం



ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

గోల్కొండ: ఆస్పత్రి ప్రాంగణలో పచ్చని మొక్కలు ఉంటే ఆస్పత్రి సిబ్బందితో పాటు ఆస్పత్రి ఇన్‌పెషెంట్‌లకు ఎంతో ప్రయోజకరంగా ఉంటుందని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మహజర్ ఉల్లా అన్నారు. మంగళవారం గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో కలిసి ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆయన వెంట వైద్యులు డాక్టర్ రజనీ, హెడ్ నర్స్ కమలమ్మ, గోపాలకృష్ణ తదితరులున్నారు.

ఐటీఐ శిక్షణ పొందిన విద్యార్థులకు మెరుగైన అవకాశాలు



కార్యక్రమంలో పాల్గొన్న నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, ఎస్వికె. నగేష్ తదితరులు

విజయనగర్‌కాలనీ: ఐటీఐ శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ మేరాజ్, ఉపాధి శిక్షణశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్వీకే నగేష్ అన్నారు. మల్లేపల్లి ఐటీఐలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్నవారు మాట్లాడుతూ.. ఐటీఐ విద్యార్థులకు వృత్తినైపుణ్యాలను పెంచి మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు శిక్షణను ఇస్తున్నామన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ ఉంటుందని మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పుష్పాల జ్యోతిరాణి వివరించారు. ఎలక్ట్రీషియన్, సివిల్, ఫిట్టర్, కంప్యూటర్ కోర్సులతో పాటు మోటార్ మెకానిక్, డిజిల్ మెకానిక్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన కొమ్ముల నరేందర్



అబిడ్స్: బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు కొమ్ముల నరేందర్ సీఎం కేసీఆర్‌ను కలిశారు. కుటుంబ సమేతంగా కొమ్ముల నరేందర్ కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలో అగ్రగామిగా ఉందన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ ముక్కెర బస్తీ నల్లపోచమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నికైంది. చైర్మన్‌గా బాబురావు, అధ్యక్షుడిగా పండరీనాథ్, వైస్ చైర్మన్లుగా శివకుమార్, మధుకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రమేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీశైలం, వేణుకుమార్, హరికృష్ణ, రూపేష్, ప్రధాన కార్యదర్శులుగా మధుసూదన్, ధన్‌రాజ్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా దేవేందర్, రత్నకుమార్, సలహాదారులుగా నర్సింగ్‌రావు, శ్యాంరావు, జ్ఞానేశ్వర్, అనంత రామారావు, రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు.



దామోదర్ గుప్తా సేవలు ఎనలేనివి



దామోదర్‌గుప్తాను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని శాసన మండలి సభ్యులు దయానంద్‌గుప్తా అన్నారు. మంగళవారం సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఆర్ట్స్ అకాడమీల ఆధ్వర్యంలో ఆయనకు సేవా విరాట్ బిరుదును ప్రదానం చేశారు. సీల్‌వెల్ కార్పొరేషన్ ఎండీ బండ్దారు సుబ్బారావు, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి ఆమని పాల్గొన్నారు.

ఓటరు లిస్టుల వెరిఫికేషన్‌లో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న మహ్మద్ సలావుద్దీన్ లోధీ

చార్మినార్: ఓటరు లిస్టులో ఓటర్ల పేర్ల వెరిఫికేషన్‌ను కామాటిలతో కాకుండా బీఎల్ఓలతో నిర్వహించాలని బీఆర్ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ డిమాండ్ చేశారు. మంగళవారం మొఘల్‌పురాలోని జీహెచ్ఎంసీ సర్కిల్–9 డీసీ కార్యాలయం వద్ద అఖిల పక్ష పార్టీల నాయకులతో డిప్యూటీ కమిషనర్ సూర్యకుమార్ సమావేశం నిర్వహించారు. చార్మినార్ శాసన సభ నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాపై ఆయన ఈ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహ్మద్ సలావుద్దీన్ లోధీ మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్య వైఖరిని పూర్తిగా తప్పుపట్టారు.

ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం



గన్‌ఫౌండ్రీ: కోలంబస్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జబర్దస్త్ కళాకారుల హాస్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మధు, కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, విక్రమ్, కిశోర్, శ్రవంతి, రజిత, దీప్తి పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.విక్రం సింగ్ అన్నారు. నూతన సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ప్రారంభించిన సందర్భంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడు తూ... వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ తమ తమ గమ్య స్థానాలకు చేరుకోవాలన్నారు.

బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం



ఆనంద్‌రావు

చార్మినార్: గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారత మాత ఆలయం, కోట మైసమ్మ ఆలయం కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేఎస్.ఆనంద్ రావు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆలయ కమిటీ సలహాదారులుగా, భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటి ఉపాధ్యక్షుడిగా పని చేసిన ఆయనకు ఈసారి కార్యనిర్వాహక అధ్యక్షుడి బాధ్యతలు లభించాయి. పలువురు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి పాతబస్తీలో జరిగే బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఇప్పటి నుంచే తగిన తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బోనాల జాతర ఉత్సవాలు ఈనెల 22న గోల్కొండ జగదాంబిక అమ్మవారికి సమర్పించే బంగారు బోనంతో ప్రారంభమవుతాయన్నారు. 7న తమ ఆలయంలో కలశస్థాపనతో పాటు ధ్వజారోహన, 9న పాతబస్తీలో అమ్మవారి ఘట స్థాపన ఊరేగింపు, 16న బోనాల జాతర ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయన్నారు. అమ్మవారికి బోనాల సమర్పణ అనంతరం 17న అమ్మవారి ఘటం సామూహిక ఊరేగింపు కొనసాగుతుందన్నారు.

పోలీస్‌స్టేషన్ విభజన శాస్త్రీయంగా జరపాలి



అడిషనల్ సీపీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

చాంద్రాయణగుట్ట: పోలీస్‌స్టేషన్ల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌ను అశాస్త్రీయంగా విభజించడం సరైంది కాదని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ గ్యార ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు బీజేపీ నాయకుల బృందం మంగళవారం అదనపు సీపీ విక్రం సింగ్ మానూకు వినతిపత్రాన్ని అందజేశారు. విభజన పేరుతో చాంద్రాయణగుట్ట పరిధిని అధికారుల స్థానిక అంశాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. స్టేషన్ పక్కనే ఉన్న ప్రాంతాలను వదిలేసి సుదూర ప్రాంతాలను మాత్రం కలపడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఈ విషయంలో అధికారులు పునరాలోచించాలన్నారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని అదనపు డీసీపీ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిరంజీవి, పండరీనాథ్, గంజి వేణు, గజిని పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలి



బల్దియా సెంట్రల్ జోన్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: అక్రమ నిర్మాణ దారులకు బల్దియా అధికారులు అండగా ఉండి వత్తాసు పలుకుతున్నారని అహ్మద్‌నగర్ డివిజన్ ఒవైసిపురా బస్తీ నాయకుడు హర్షద్ అహ్మద్ అన్నారు. అహ్మద్‌నగర్ డివిజన్ ఒవైసిపురా బస్తీలో ఇంటి నెం.10-4-771/82/53 వద్ద అక్రమంగా నిర్మిస్తున్న జీ-ప్లస్ 5 కమర్షియల్ కాంప్లెక్స్‌ను తక్షణమే తొలగించాలని కోరుతూ ఆయన సీపీఎం నాంపల్లి జోన్ కమిటీ వారితో కలసి బల్దియా సెంట్రల్ జోన్ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌కు వినతిపత్రం అందజేచారు. తాము జీహెచ్ఎంసీ అధికారులకు ఈ భవనాన్ని నిర్మిస్తున్న బిల్డర్‌పై ఫిర్యాదు చేశామని, అయితే అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కన్వీనర్ మల్లేష్, గ్రేటర్ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు వెంకటేష్, చౌకత్, మహ్మద్ రియాజ్, మహ్మద్ ముకరమ్, అబ్దుల్ రషీద్ తదితరులున్నారు.

ఇంటింటికీ బీజేపీ



గోల్కొండ: తెలంగాణలో బీజేపీకి ప్రజాదరణ పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ డివిజన్‌లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకులు ప్రజలను కలుసుకుని 9 ఏళ్ల నరేంద్రమోదీ పాలనలో దేశం సాధించిన విజయాలు, పేదలకు అందిన సంక్షేమ ఫలాలను వివరించారు. అదే విధంగా తెలంగాణలో కేసీఆర్ పాలనలో ప్రజలు ఏ విధంగా మోసపోయారో ప్రజలకు వారు వివరించారు. ఆయన వెంట నామా యాదగిరి నేత, అశ్విన్, ప్రభు పూజారి, మురళీకృష్ణ తదితరులున్నారు.

మహిళ అదృశ్యం



అబిడ్స్: మహిళ అదృశ్యమైన ఘటన షాహినాయత్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బేగంబజార్ జగన్నాథ్ వాడలో నివసించే పుష్ప గత నెల 12న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న షాహినాత్‌గంజ్ పోలీసులు ఆమె ఆచూకీ కోసం గాలిస్తున్నారు. పుష్పకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇంటి నుంచి ఆస్పత్రికి వెళ్లిన పుష్పకు మానసిక పరిస్థితి సరిగా లేదని కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684